పేదల చెంతకు ఫ్యామిలీ డాక్టర్

- ప్రతి రోజూ ఒక్కో సచివాలయ పరిధిలో సేవలు
- మంచానికే పరిమితమైన రోగుల ఇంటికి వెళ్లి చికిత్స



భాగ్యనగర్ కాలనీలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ యాస్మిన్

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదల చెంతకు చేరిందని ఫ్యామిలీ డాక్టర్ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ యాస్మిన్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీలో శనివారం జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరిపడా అన్ని మందులు ఉన్నాయో లేదో పరిశీలించి రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించారు. కాలనీకి చెందిన చిలుకా నయోమి అనే గర్భిణిని పరీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్ నెలలో ఒక రోజు ఒక సచివాలయం పరిధిలో వైద్యుడితో సహా వైద్య బృందం సేవలను అందిస్తుందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపి నిర్వహించి మధ్యాహ్నం నుంచి రోగుల ఇళ్లకు వెళ్లడం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి వైద్య సేవలను అందిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆ సచివాలయంలోనే వైద్యుడు ఓపి నిర్వహిస్తారన్నారు. ఆ సమయంలో అక్కడ 104 అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని, పూర్తిస్థాయిలో మందులను అందుబాటులో ఉంచుతారన్నారు. ఈ ఓపీలో 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆశ కార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, వార్డు హెల్త్ సెక్రటరీ సహాయంతో ఆ సచివాలయం పరిధిలోని గర్భిణీలను ఓపీ కి తీసుకువచ్చి అవసరమైన రక్త పరీక్షలతో పాటు బీపీ కూడా తనిఖీ చేస్తారన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి చికిత్స అందిస్తారన్నారు. గర్భ నిర్ధారణ పరీక్షలను కూడా అక్కడ నిర్వహించి అవసరమైన మందులను అందజేస్తారన్నారు. లెప్రసి, టీబీ వ్యాధిగ్రస్తులను కూడా ఓపీ కి రప్పించి వారి ఆరోగ్య పరిస్థితులను సమీక్షిస్తారన్నారు. అవసరమైతే అదనపు మందులను కూడా అక్కడ అందజేస్తారన్నారు. మధ్యాహ్నం సచివాలయ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తారన్నారు. విద్యార్థులకు వివిధ రక్త పరీక్షలను నిర్వహిస్తారని చెప్పారు. వారికి ఇప్పటికే అందజేసిన ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల ను ఎలా వాడుతున్నారు అన్న విషయంపై తనిఖీ చేస్తారన్నారు. ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు పోషకాహార లోపం, తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిని గుర్తిస్తారన్నారు. అలా గుర్తించిన వారికి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా డబుల్ రేషన్ ఇచ్చేందుకు సిఫార్సు చేస్తారన్నారు. మంచం పైనే ఉండి లేవలేని రోగుల ఇళ్లకు వైద్యులు మధ్యాహ్న పర్యటన సందర్భంగా వెళ్తారన్నారు. వారికి బీపీ, షుగర్, హెచ్‌బీ వంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మంచం పైనే ఉండడానికి గల విషయాలపై కేస్ స్టడీ లను చేపడతారన్నారు. వైద్య పరీక్షలు అనంతరం రోగికి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. ఆ నెలలో ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేయించుకుని డిశ్చార్జ్ అయిన రోగులను కూడా వారి ఇళ్లకు వెళ్లి పరీక్షిస్తారన్నారు. అదనపు వైద్యం అవసరాన్ని నిర్ధారించి అవసరమైన చర్యలు చేపడతారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం చాలా మంచి కార్యక్రమం అని, అందరూ ఈ సేవలు వినియోగించుకోవాలని కోరారు. ముందుగా గ్రామ సర్పంచ్ కె. మహా లక్ష్మమ్మ, ఎంపీటీసీ కె.వీరమ్మ, వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలుకా జయపాల్ లు డాక్టర్ యాస్మిన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ అనూష, హెల్త్ విజిటర్ వరలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్‌లు పెండెం మణిరావు, నటరాజ్, నవీన, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఇజ్రాయిల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బర్మా నాయక్, ఆశ కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ప్రతిష్ట విగ్రహాలకు ప్రత్యేక పూజలు



తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో భీమేశ్వర శ్రీవీరభద్రేశ్వర స్వామి వార్ల బింబియంత్ర శిఖర ధ్వజ పునఃప్రతిష్టమహోత్సవంలో భాగంగా శనివారం ప్రతిష్ట విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండపారాధన, పీఠార్చనలు, గర్త న్యాసం, రత్నన్యాసములు, బింబశుద్ధి, విశేషహోమములు, బలిహారణ నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌కు మొదటి విడత పాఠ్యపుస్తకాలు



నకరికల్లు: మొదటి విడత జగనన్న విద్యాకానుక పుస్తకాలు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలోని స్టాక్‌పాయింట్‌కు చేరినట్లు ఎంఈఓ కె.జ్యోతికిరణ్ శనివారం తెలిపారు. మొదటి విడత క్రింద 15,168 పుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలిన పుస్తకాలు చేరిన తర్వాత సంబంధిత పాఠశాలల్లో త్వరలో పంపిణీ చేస్తామన్నారు. ఈ ఏడాది ముందస్తుగా పాఠ్య పుస్తకాలు చేరడం ద్వారా విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో స్టాక్‌పాయింట్ ఇన్‌చార్జి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.రంగాదేవి, మండల కో ఆర్డినేటర్ బత్తిన మల్లిఖార్జునరావు, సీఓఎస్ అంజమ్మ, సీఆర్‌పీలు, ఐఈఆర్‌టి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల కేంద్రానికి చేరిన జేవీకే కిట్స్

ముప్పాళ్ళ: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక కిట్స్ మండల విద్యావనరుల కేంద్రానికి వచ్చాయని ఎంఈఓ ఒంగోలు రాజు శనివారం తెలిపారు. మొత్తం 33 పాఠశాలలకు గాను 3,566 మందికి యూనిఫాం 12,862 పుస్తకాలు అందాయన్నారు. విద్యాసంవత్సరం ఆరంభం కాగానే ఆయా కిట్స్‌ను విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో చేరే వారికి 15వ వరకు దరఖాస్తు....

ఆర్టీయాక్ట్12(1)సి ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు కోసం ఈ నెల 15వ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈఓ ఒంగోలురాజు తెలిపారు. సంబంధిత వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రవ్వవరం ఆర్‌బీకేలో దొంగతనం



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని పుచ్చనూతల పంచాయతీ పరిధిలోని రవ్వవరం గ్రామంలో గల రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రాత్రి దొంగలు తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఆర్‌బీకేలోని కంప్యూటర్‌కు సంబంధించిన కొన్ని వస్తువులను, ఒక ట్యాబ్‌ను దొంగలు అపహరించుకెళ్లారు. ఈ విషయంపై ఆర్‌బీకే సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శావల్యాపురంలో ప్రజావేదిక

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ ఉపాధి పథకం 16వ విడత సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక కార్యక్రమం శనివారం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా 15 గ్రామ పంచాయతీలలో 521 పనులకు గాను రూ. 5 కోట్ల 79 లక్షల 14 వేల 437 రూపాయలు వెచ్చించారు. గ్రామాల వారీగా చేసిన పనులు నిధులు వెచ్చింపుపై సదస్సులో వివరించారు. అనంతరం మండలంలోని అన్నీ గ్రామాల వారీగా రీకవరి రూ.76 వేల 936లు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరు గంగవరపు జోసఫ్‌కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి తలారి విజయలక్ష్మి, అవినీతి నిరోధక శాఖాధికారి జి.బాబురావు, ఏపీడీ బూసిరెడ్డి, ఏపీవోలు రాజు, పి.పద్మజా, టీఎలు శ్రీనివాసగుప్తా, సుబ్బారావు, సుధాకర్ ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

రాష్ట్ర వైద్యశాఖ అదనపు డైరెక్టర్ డా.జె.యాస్మిన్



రుద్రవరంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం రికార్డులు పరిశీలిస్తున్న డా.జె.యాస్మిన్

రుద్రవరం(ముప్పాళ్ళ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలందించాలని రాష్ట్ర వైద్యశాఖ అదనపు(లెప్రసీ) డైరెక్టర్, నోడల్ ఆఫీసర్ డా.జె.యాస్మిన్ చెప్పారు. మండలంలోని రుద్రవరం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని శనివారం తనిఖీ చేశారు. మంచంలో ఉన్న వారి వద్ద కు వెళ్లి వారికి అవసరమైన ఆరోగ్య సేవలందించాలన్నారు. గర్భిణులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. షుగర్, బీపీ రోగులకు అందిస్తున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. కుటుంబనియంత్రణ, వ్యాధి నిరోధక టీకాలు, మాతాశిశు సంరక్షణ సేవలపైన ఆరా తీశారు. గ్రామంలో పారిశుద్ధకార్యక్రమాల అమలుపైన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా రికార్డులు పరిశీలించారు. 109 మంది ఓ.పి ఉన్నట్లుగా గుర్తించారు. కార్యక్రమంలో వైద్యులు డి.నవ్య, కార్యాలయ ఏఓ కె.చైతన్య, హెల్త్ సూపర్‌వైజర్ ఏ.పీటర్‌డానియేన్, రవిచంద్ర, ఏఎన్ఎమ్‌లు దివ్యకీర్తి, పద్మ, నజిరున్నీసా, రాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహప్రతిష్ట మహోత్సవం



వీరహనుమాన్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో గుంటూరు మేయర్ కావటి

అచ్చంపేట: మండలంలోని మిట్టపాలెంలో కార్యసిద్ధి వీరహనుమాన్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు అంబటి సుబ్బారావు ఆధ్వర్యంలో ఉదయం గం.9.43 నిమిషాలకు వీరహనుమాన్ ఏకశిలా విగ్రహాన్ని క్రేన్ సహాయంతో ప్రతిష్టించారు. వేద పండితుల వేదమంత్రోచ్చారణలతో పూజా కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జోనల్ ఇన్‌చార్జ్ కన్నా హనుమంతరావు జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, అనంతవరం మాజీ సర్పంచ్ కాల్వపల్లి సాంబిరెడ్డి, కాల్వపల్లి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య తదితరులు హాజరయ్యారు.

విద్యార్థి వినికిడి సమస్యకు పరిష్కారం



ఉన్నవలో విద్యార్థికి రూ.40 వేలు అందజేస్తున్న ఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

యడ్లపాడు: నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడికి వినికిడి లోపం ఉందని తెలిసి ఎంఆర్ ఫౌండేషన్ స్పందించింది. మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన గల్లా వెంకటేశ్వర్లు, జ్యోతి దంపతుల కుమారుడు మహేష్‌కుమార్‌కు ఐటీఐ చదువుతున్నాడు. చిన్ననాటి నుంచే అతనికి వినికిడి లోపం ఉన్నందున బాధపడుతున్నట్లు ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్‌నాయుడి దృష్టికి గ్రామస్తులు తెచ్చారు. విద్యార్థి ఇబ్బందిని గుర్తించి తక్షణమే స్పందించిన రాజేష్ నాయుడు విజయవాడలోని ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స చేయించి, నాణ్యతతో కూడిన అత్యాధునిక వినికిడి పరికరం కొనుగోలుకు రూ.40వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ తల్లిదండ్రులు మల్లెల రాజేష్ నాయుడు గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఉన్నవ గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో గుత్తి సింగయ్య, గల్లా వీరరాఘవయ్య, వెంకట్రావు, కుంచెనపల్లి సాంబశివరావు, వెంకట్రావు, గ్రామపెద్దలు, ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

జెడ్పీటీసీ విజయప్రతాప్‌రెడ్డి

అచ్చంపేట: విధి నిర్వహణలో అలసత్వం పనికిరాదని, అందరం ప్రజా సేవకులమేనని, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ప్రతి రోజు వచ్చే రోగులు, సిబ్బంది హాజరు రిజిష్టర్స్ పరిశీలించారు. అందుబాటులో ఉన్న రక్తపరీక్షలను సూచించే బోర్డులను ఉంచాలన్నారు. లభ్యమయ్యే మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుక్కకాటు, పాముకాటు వాక్సిన్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాల పరిశుభ్రత గురించి ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీశాఖ అధికారులు

రాజుపాలెం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని పర్యావరణాన్ని కాపాడాలని ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి నీలిమాదేవి తెలిపారు. మండలంలోని దేవరంపాడు శ్రీవెంకటేశ్వరదేవస్థానం పరిసర ప్రాంతాల్లో పర్యావరణ రహితశైలిపై దేవస్థానం పరిసరాలను శనివారం పరిశుభ్రం చేశారు. దేవస్థానానికి వచ్చిన భక్తులు ప్లాస్టిక్ వస్తువులను, చెత్తా చెదారాన్ని ఏరివేశారు. దేవస్థానం తిరుణాళ్ల సందర్భంగా పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ అధికారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదని తెలిపారు. అనంతరం అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, దేవస్థానం ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి, గుళ్లపల్లి ఫారెస్టు బీట్ అధికారి ఎస్ గోవిందరాజులు, దీనమ్మ అండ్ రూరల్ డెవెలెప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరరావు, భక్తులు బాబు, వర్లా సాంబశివరావు, అల్లాభక్షు పాల్గొన్నారు.

అటవీ పరిరక్షణ అందరి బాధ్యత

డీఆర్‌వో హరికుమార్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

బొల్లాపల్లి: ప్రజాజీవన విధానంలో అడవులను రక్షించాల్సిన బాధ్యత అందరిదని మేళ్లవాగు సెక్షన్ డీఆర్‌వో ఎం.హరికుమార్ తెలిపారు. పర్యావరణ హిత జీవన విధానంలో భాగంగా మండలంలోని మేళ్లవాగు సెక్షన్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలను భాగస్వామ్యులను చేసి అటవీ సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఒకసారి వాడిన ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ప్లాస్టిక్‌ను వాడి అటవీ ప్రాంతాల్లో పడవేయరాదని సూచించారు. అడవుల సంరక్షణతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, ప్రజల భాగస్వామ్యంతో అడవులను పరిరక్షించేందుకు అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్‌వో తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు ఆర్. లక్ష్మణ్‌నాయక్, షేక్ అమీర్‌జానీబాషా, మీఎస్ఎస్ సోము శ్రీనివాసరావు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రసన్నాంజనేయుడి కల్యాణ ఉత్సవాలు

- మూడు రోజులపాటు కల్యాణ వేడుకలు
- రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామి వారి జయంతి కల్యాణ మహోత్సవ వేడుకలు నేటి నుంచి ఈ నెల 16వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు మండల దేవాదాయ శాఖ ఈఓ గాదె రామకోటిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటిగా ఈ ఆలయం ఉంది. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కోళ్లూరు నుంచి గత ఎనిమిది సంవత్సరాల క్రితం స్వామి వారిని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్దకు తరలించారు. ప్రతి సంవత్సరం వలే ఈ ఏడాది స్వామి వారి 63వ కల్యాణ వేడుకలను నిర్వహించనున్నారు. 14న ఆదివారం మొదలుకుని మంగళవారం వరకూ స్వామివారి కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నారు. 14న ఉదయం ఆరు గంటలకు రామ నామ సంకీర్తన తో పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని ఆలయ అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. 15న ఉదయం సుప్రభాత సేవ, ఆకు పూజలు, అభిషేకాలను నిర్వహించనున్నారు. అనంతరం తీర్థ ప్రసాద వినియోగము, కోలాట కార్యక్రమాలు ఉన్నట్లు తెలిపారు. 16న ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా ఉత్సవాల సందర్భంగా మూడు రోజులు పాటు పలు సాంస్కృతిక కార్యాక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు పూర్తి...

శ్రీ కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి వారి కళ్యాణోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయిలో బాలురు, బాలికలు రెండు విభాగాలలో కబడ్డీ పోటీలు నిర్వహించన్నుట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలో నలుమూలల నుంచి కబడ్డీ జట్లకు ఆహ్వానం పంపినట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా దాదాపుగా ఐదు నుంచి ఆరు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు ముందుగా కమిటీ సభ్యులకు వివరాలను అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీలపై వివరాల కోసం : 8179669215, 9010412799, 8897143142 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నేడు హనుమాన్ జయంతి



ప్రత్యేక అలంకారంలో భక్తాంజనేయ స్వామి

అమరావతి: మండల పరిధిలోని మల్లాది ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 14వతేదీ ఆదివారం హనుమత్‌జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త భవిరిశెట్టి హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకుడు పరుచూరి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో 14వతేదీ ఉదయాన్నే విష్వక్సేనారాధన, పుణ్యాహవాచన, రజత నాగవల్లీ దళార్చన నిర్వహించి భక్తులకు ధ్యానాంజనేయ స్వామివారి దర్శనం కల్పిస్తామని తెలిపారు. అనంతరం వివిధ గ్రామాల భజన మండళ్ళచే నామ సంకీర్తన, మధ్యాహ్నం 12గంటలకు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులందరికి అన్న సంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో వేంచేసి యున్న ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఆలయ నిర్వాహకుడు బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు.



ఆహ్వాన పత్రాలు అందిస్తున్న అన్నం వెంకటరమణ, సభ్యులు

భక్తాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: హనుమత్ జయంతోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసియున్న శ్రీ భక్తాంజనేయ స్వామి వారికి శనివారం పంచామృత అభిషేకము, విశేష అలంకరణ, ఆకు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి వివి నరసింహా చార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో రమేష్ బాబు, హనుమాన్ కుమార్, గురు, వసుంధర, చంద్రిక, వెంకటేశ్వర్లు, ఫిరోజి, చిన్న, ప్రసాదు, కృష్ణ సాయి, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: హనుమాన్ జయంతి శుభ దినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల జరుగుతున్న దానిలో భాగంగా పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు గుంటూరు రోడ్డులో ఉన్న శ్రీ సరస్వతీ శిశు మందిర్ వద్ద నుంచి నారాయణసేన నగర సంకీర్తన సంఘం, సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో జరుగుతున్న హనుమాన్ శోభాయాత్రా, బైక్ ర్యాలీ నీ విజయవంతం చేయాలని నారాయణసేన నగరసంకీర్తన సంఘం అధ్యక్షుడు అన్నం వెంకటరమణ పిలుపునిచ్చారు. పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆహ్వాన పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న హిందుబంధువులు అందరు పాల్గొని సనాతన ధర్మాన్ని నిలబెట్టాలన్నారు. ఈ ర్యాలీని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చేతులమీదుగా ప్రారంభము అవుతుందన్నారు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి

వినుకొండ (నూజెండ్ల): రైలు కింద పడి గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన వినుకొండ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం జరిగింది. తిరుపతి నుంచి గుంటూరు వెళ్తున్న 17262 నంబరు గల రైలు ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందాడు. ట్రాక్‌మాన్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 60 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై ఎర్ర రంగు టీషర్ట్, కాఫీ కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్నేహమేరా జీవితం.. శాశ్వతం!



శావల్యాపురంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శావల్యాపురం: ఎప్పుడో చిన్ననాడు వారంతా కలసి చదువుకున్నారు. చదువులమ్మ ఒడిలో హాయిగా బాల్యాన్ని ఆస్వాదించి విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకుని పెద్ద చదువులు చదివి ఎక్కడెక్కొడో కొలువులు సంపాదించుకుని జీవనం సాగిస్తున్నారు. ఇదంతా ఎప్పుడో పాతికేళ్లనాటి సంగతి. మళ్లీ ఇవాళ వారంతా చదువులమ్మ చెంతకు తరలివచ్చారు. చదువుకున్న తరగతి గదులు, ఆటలాడిన మైదానాన్ని చూసి భావోద్వేగానికి లోనయ్యారు. ఆనాడు తాము చేసిన అల్లరి పనులు, చిలిపి చేష్ట లు, మధురానుభూతులను నెమరువేసుకున్నారు. శావల్యాపురంలోని హైస్కూలులో ఆత్మీయ సమ్మేళనం పేరిట శనివారం కలిశారు. పూర్వవిద్యార్థుల రాకతో పాఠశాల కళకళలాడుతూ కనిపించింది. జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 1997–98 పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలల్లో స్థిరపడిన ఆయా విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై స్నేహితులను కలుసుకొని యోగక్షేమాలు తెలుసుకొని తాము చదువుకున్న తరగతి గదులను సహ విద్యార్థులతో సందర్శించి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి పాదాభివందనం చేసుకున్నారు. గురువులతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. గురువులు నేర్పిన పాఠాలే తమ అభివృద్ధికి కారణమని సంతోషం వ్యక్తం చేశారు. పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి తమవంతు ఆర్థిక చేయూత అందిస్తామన్నారు. అనంతరం అందరు కలిసి గ్రూపు ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు హనుమంతరావు, యోగయ్య, నాగేశ్వరరావు, రాంబాబు, పద్మేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.